క్లుప్తంగా

నేడు పెదకాదలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామంలో శుక్రవారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంధకారంలో ఎస్సీ కాలనీ



కర్ర సపోర్టుతో ఉన్న విద్యుత్ స్తంభం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంభాం ఎస్సీ కాలనీ వాసులు అంధకారం నెలకొంది. బుధవారం రాత్రి నుంచి కాలనీకి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలందరూ చాలా ఇబ్బంది పడ్డారని ఎంపీటీసీ సభ్యుడు టొంపల సంజీవరావు తెలిపారు. మూడు నెలల కిందట వీచిన ఈదురు గాలులకు మూడు విద్యుత్ స్తంభాలు వాలిపోయాయని, ఇందులో ఒక విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారడంతో కర్ర దన్నుగా పెట్టినట్లు చెప్పారు. విద్యుత్ స్తంభాలను సరిచేయడంతో పాటు లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని విద్యుత్ శాఖాధికారులకు పలుమార్లు కోరినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ సన్యాసిరావు వద్ద ప్రస్తావించగా.. శుక్రవారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లో ఓల్టేజీ సమస్య పరిష్కరిస్తామన్నారు.


18న విజయవాడలో ధర్నా



నల్లబ్యాడ్జీలతో లెక్చరర్ల నిరసన

శృంగవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించని ఎడల ఈ నెల 18న విజయవాడలో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల లెక్చరర్లు తెలిపారు. దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి లెక్చరర్లు నిరసన వ్యక్తం చేశారు. జేసీటీఏ, జీసీజీటీఏ అధ్యాపక సంఘాల పిలుపు మేరకు నిరసన చేపట్టినట్లు జీసీజీటీఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈరన్న తెలిపారు. బోధనేతర సిబ్బందికి పదోన్నతులు ఇవ్వాలని.. అధ్యాపకులను సహాయ ఆచార్యులుగా మార్చాలని కోరారు. ప్రభుత్వం సకాలంలో స్పందించని ఎడల ధర్నా చేపట్టక తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు పి. భాస్కరరావు, కె.వాసుదేవరావు, ఆర్.శ్రీలక్ష్మి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం



తాగునీటి కుళాయిలు ప్రారంభించిన ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోట పట్టణంలోని నడబంద ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ..ప్రజలందరికీ సురక్షిత నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి దేవి, ప్రసాద్, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'బీమాను సద్వినియోగం చేసుకోవాలి'

వేపాడ: ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకుని కుటుంబానికి భరోసా కల్పించాలని స్థానిక ఏపీ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్‌గోపాల్ అన్నారు. బల్లంకి గ్రామంలో సీఎస్పీ సారిక ఈశ్వరరావు నేతృత్వంలో గురువారం నిర్వహించిన సురక్ష అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పీఎంఎస్‌బీవైలో ఖాతాదారుడు 20 రూపాయల ప్రీమియం చెల్లిస్తే.. ప్రమాదవశాత్తూ మృతి చెందితే కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల పరిహారం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు జాతీయభావం పెంపొందేలా ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో తెలిపారు.

పైసలిస్తేనే పాస్‌బుక్..

- ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా మ్యుటేషన్‌కు ఓకే
- అధికార పార్టీ నేతలు చెప్పిన వారివే ఆమోదం
- రైతులు నేరుగా దరఖాస్తు చేసుకుంటే తిరస్కారం
- అధికారుల తీరుపై మండిపడుతున్న జమ్ము రైతులు



జమ్ము సచివాలయంలో విచారణ చేస్తున్న గరివిడి ఆర్ఐ అచ్యుతరావు(ఫైల్)

గుర్ల:

మ్యుటేషన్లు ఆమోదించాలంటే రెవెన్యూ అధికారులకు నగదు అయినా చెల్లించాలి.. లేదా కూటమి నాయకుల సిఫార్సు అయినా తీసుకురావాలని జమ్ము రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని జమ్ము రైతులకు గరివిడి మండలంలోని తోండ్రంగి రెవెన్యూలో భూములున్నాయి. ఈ జిరాయితీ భూములు వంశపారంపర్యంగా వస్తున్నాయని.. వాటిని తమ పేరు మీద మార్చడానికి మ్యుటేషన్ కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కూటమి నేతల ఒత్తిడితో ఇటీవల గ్రామ పురోణీలు ఉన్న 25 సర్వే నంబర్లకు రైతుల పేరిట మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోగా వాటిని ఆమోదించి ఆన్‌లైన్ చేశారు. రెండు నెలలు కిందట ఇదే 25 సర్వే నంబర్లకు సంబంధించి రైతులు నేరుగా మ్యుటేషన్ దరఖాస్తు చేసుకుని రెవెన్యూ అధికారులకు తగిన ఆధారాలు చూపించినప్పటికీ వాటిని తిరస్కరించారు.

అఫిడవిట్ ఇస్తే చాలు

గ్రామ పురోణీలతో మ్యుటేషన్ ఆమోదిస్తే ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడుతుందనే ఉద్దేశంతో ఏవరైనా రైతు మ్యుటేషన్ దరఖాస్తు చేసుకున్నప్పటికీ వాటిని అధికారులు తిరస్కరిస్తారు. అయితే తోండ్రంగి రెవెన్యూ భూములు ఆన్‌లైన్ చేయడానికి మాత్రం గరివిడి రెవెన్యూ అధికారులకు స్వతహాగా ఇచ్చిన అఫిడవిట్, కూటమి నేతల సిఫార్సు ఉంటే సరిపోతుంది.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

గరివిడి రెవెన్యూ అధికారులపై గుర్ల మండలంలోని జమ్ము రైతులు జిల్లా కేంద్రంలోని గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గరివిడి ఆర్ఐ అచ్యుతరావు గ్రామంలో విచారణ చేసినప్పటికీ, రైతులకు న్యాయం చేయకుండా అధికారులను కాపాడే విధంగా రిపోర్టు తయారు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు.

మూడుసార్లు తిరస్కరించారు..



తోండ్రంగి రెవెన్యూ పరిధిలో నాకు ఉన్న జిరాయితీ భూముల ఆన్‌లైన్ కోసం మూడుసార్లు మ్యుటేషన్ దరఖాస్తు చేసుకున్నాను. మూడుసార్లు కూడా తిరస్కరించారు. గ్రామ పురోణి, అఫిడవిట్, గ్రామ పెద్దల తీర్మానం ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది.

– చింతపల్లి సూరిసత్యం, రైతు, జమ్ము

ఫలితం లేదు..



తోండ్రంగి రెవెన్యూలోని భూములను నాపేరిట ఆన్‌లైన్ చేయడానికి గరివిడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. ఎన్నిసార్లు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నా తిరస్కరిస్తున్నారు. వృద్ధాప్యం కారణంగా అధికారుల చుట్టూ తిరగలేకపోతున్నాను.

– వెంపదాపు అప్పలనాయుడు, రైతు, జమ్ము

సరైన పత్రాలుంటే..



తోండ్రంగి రెవెన్యూలోని భూములకు సంబంధించి జమ్ము గ్రామ రైతులు మ్యుటేషన్ దరఖాస్తులు చేసుకున్నారు. వాటిలో రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్నవాటినే ఆమోదించాం. రెవెన్యూ సిబ్బంది ఎవ్వరూ రైతుల నుంచి డబ్బు తీసుకోలేదు.

– బంగ్గారాజు, తహసీల్దార్, గరివిడి

ఘనంగా రక్షాబంధన్..



గుర్ల పంచాయతీ కార్యదర్శి జగదీశ్వరికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి మాధురి

గుర్ల: మండల కేంద్రంలో రక్షాబంధన్ వేడుకలు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల అధికారులకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ ప్రేమానురాగాలతో కలసిమెలిసి ఉండాలని కోరారు.

రాఖీ సందడి..

శృంగవరపుకోట: పాఠశాలలకు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో పట్టణంలోని కొముది గ్లోబల్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు జరిపారు. పలువురు విద్యార్థినులు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు.



శృంగవరపుకోట: విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

డిప్యూటీ సీఎం గారూ..
15వ ఆర్థిక సంఘం నిధులెక్కడ..?

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు 'వలిరెడ్డి'



చీపురుపల్లి: పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది.. కాలువల్లో పిచికారీ చేసేందుకు బ్లీచింగ్ కొనాలన్నా, కనీసం వీధి లైట్లు కొనుగోలు చేయాలన్నా కూడా పంచాయతీ ఖాతాల్లో నిధుల్లేవని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. పంచాయతీలు అస్తవ్యస్తంగా తయారుకావడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష నివాసంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశ్నిస్తా, ప్రశ్నిస్తా అంటూ జనంలోకి వచ్చిన పవన్‌కల్యాణ్ ఇప్పుడు సమాధానం చెప్పాలన్నారు. పంచాయతీలకు రూ.1212 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసి ఏడు నెలలు కావస్తున్నప్పటికీ.. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా పంచాయతీ ఖాతాలకు జమ కాలేదన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కనీసం పారిశుధ్య పనులు చేపట్టేందుకు కూడా నిధులు లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తూ పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఒక్కరోజు కూడా సమీక్ష నిర్వహించిన పరిస్థితులు కూడా లేవన్నారు. అంతేకాకుండా జిల్లా పరిషత్‌లో జనరల్ ఫండ్స్ కూడా లేవని తెలిపారు.

సిద్ధమవుతున్న గణనాథుని విగ్రహాలు



మట్టి విగ్రహాలు తయారు చేస్తున్న కళాకారుడు అప్పారావు

గజపతినగరం: మరికొద్ది రోజుల్లో వినాయక చవితి రానున్న నేపథ్యంలో కళాకారులు మట్టి విగ్రహాల తయారీలో బిజీగా ఉన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు ఉండడంతో మట్టి వినాయక విగ్రహాలకు డిమాండ్ నెలకొంది. దీంతో మట్టి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. మండల కేంద్రంలోని కుమ్మరివీధిలో ప్రతి ఏడాదీ మట్టి విగ్రహాలు తయారు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా విగ్రహాల తయారీలో కళాకారులు తలమునకలై ఉన్నారు. ఈ సందర్భంగా కళాకారుడు అప్పారావు మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా చినతాడివాడ నుంచి మట్టి తీసుకువచ్చి విగ్రహాలు తయారు చేస్తుంటామని చెప్పారు. నాలుగైదు రోజులు కష్టపడితే ఆరు అడుగుల విగ్రహం తయారవుతుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పెంచుకోవచ్చు

- తహసీల్దార్ ధర్మరాజు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ధర్మరాజు

చీపురుపల్లి: అవసరమైన చోట పోలింగ్ కేంద్రాలను పెంచుకునేలా ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినట్లు తహసీల్దార్ డి.ధర్మరాజు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లుంటే కొత్తగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అంతేకాకుండా పోలింగ్ కేంద్రాల పేర్లు, స్థానాలు మార్చుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, బీజేపీ, టీడీపీ ప్రతినిధులు పి.మురళి, ఐ.నీలకంఠం, జి.నాగరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం. హర్షవర్ధిని, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

- ఏపీజీఈఏ నాయకులు



టీ తాగుతూ నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీజీఈఏ సంఘ ప్రతినిధులు

చీపురుపల్లి: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎంతో కాలంగా రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఏపీజీఈఏ సంఘ నేతలు డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ఏపీజీఈఏ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువా రం 'రండి టీ తాగుదాం...కలిసి మాట్లాడుకుందాం' పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్ సీ బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. ఐకమత్యంగా పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా జాయింట్ సెక్రటరీ పిన్నింటి హరి, చీపురుపల్లి శాఖ ఇన్‌చార్జ్ జి.లక్ష్మణనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జరజాన అచ్యుతరావు, సీహెచ్.ప్రసాద్, ఉద్యోగ సంఘ నాయకులు కె.విశ్వేశ్వరరావు, జీవీ రమణ, ఆర్.వరప్రసాద్, కె.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, కొంచడ అప్పలనాయుడు, ఎస్.అప్పలనాయుడు, సురే ష్, యశోద, చందక శ్రీను, ఆల్తి వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న క్రీడాకారులు, వాకర్స్

గజపతినగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో క్రీడాకారులు, వాకర్స్ గురువారం శ్రమదానం చేపట్టారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూడి వెంకటరావు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బొంతలకోటి శంకరరావు మాస్టారు, శేఖర్ మాస్టారు, తదితరుల ఆధ్వర్యంలో క్రీడాకారులు, యువత పిచ్చిమొక్కలు తొలగించారు.

ప్రజలను వంచించడం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ నాయకులు



చీపురుపల్లి రూరల్: చంద్రబాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు.

మెరకముడిదాం: ప్రజలను వంచించడం చంద్రబాబునాయుడు నైజమని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని యాడిక గ్రామంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొత్స మోహనరావు, పప్పల కృష్ణమూర్తి, సర్పంచ్‌లు గోవింద్, రామశివ, ఎంపీటీసీ సభ్యులు చిరంజీవిరావు, శంకరరావు, గరుగుబిల్లి నాయకుడు శనపతి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని గదబవలస పంచాయతీ పరిధి ఐతాంవలసలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. అధికారం చేపట్టి 13 నెలలు పూర్తయినా ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ప్రజలకు తెలిపారు. తల్లికి వందనం చాలా మందికి వేయలేదని.. గ్యాస్ డబ్బులు చాలా మంది ఖాతాదారులకు పడలేదని చెప్పారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పెన్షన్ పథకాల ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయలేని కూటమి నాయకులు కనిపిస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లంటి సత్యనారాయణ, యల్లంటి పోలీస్‌నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.శ్రీరాములనాయుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీ లెంక శ్రీరాములు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, పలు పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జి.తమ్మినాయుడు, అలమండ అప్పలనాయుడు, ముద్దాడ రమణ పాల్గొన్నారు.



మెరకముడిదాం: ఇంటింటికీ వెళ్ల కూటమి వైఫల్యాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లక్ష్మీపురంలో..

జామి: మండలంలోని లక్ష్మీపురంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతూ.. హామీలిచ్చి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. కూటమి నాయకులు గ్రామాల్లోకి వస్తే హామీలెందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తూ నిలదీయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, నేతలు కిలారి సూర్యారావు, అప్పాన సుబ్రమ్మణ్యం, సర్పంచ్ గొల్లు రామకొండ, ఎం.దేముడు, రాజనాయుడు, బండారు సత్యం, వెంకట సత్తిబాబు, ప్రసాద్, వాసు, ముగడ కనకరాజు, దువ్వ అప్పలరాము, సీహెచ్. రామునాయుడు, పి.ఎర్నాయుడు పాల్గొన్నారు.



జామి: లక్ష్మీపురం గ్రామంలో బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రవికుమార్, అరుణ

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిస్ట్ రమేష్

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ అంధత్వనివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆప్తాలమిస్ట్ బి.రమేష్, సీహెచ్ఓ రమాదేవి విద్యార్థులను పరీక్షించి, ఐదుగురు విద్యార్థులు నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. వీరికి త్వరలోనే కళ్లద్దాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆల్తి రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినం

కొత్తవలస: ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డి. సీతల్‌వర్మ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఏడాది నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న వారు 8,914 మంది ఉన్నట్లు తెలిపారు. వీరందరిచే ఈ నెల 12న ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ అప్పలకొండ, ఈఓ సన్యాసినాయుడు, సూపర్‌వైజర్లు సూరిదేముడు, బేబీరాణి, నిర్మల, పలువురు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ సముదాయం ప్రారంభం

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, రైతుసేవా కేంద్రాలను ఎమ్మెల్సీ రఘురాజు గురువారం ప్రారంభించారు. ఈ కార్యాలయాలను పాలనా వ్యవహారాలకు వినియోగించుకోవాలని సర్పంచ్ యాళ్ల వెంకటరమణ, తదితరులకు సూచించారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఒకే ప్రాంగణంలో సచివాలయం, హెల్త్‌సెంటర్, ఆర్‌బీకేలను నిర్మించారు. భవనాలు పూర్తయినా వాటిని ప్రారంభించకపోవడంతో పాలనా వ్యవహారాలకు ఇబ్బందిగా ఉందని సర్పంచ్ సహా పలువురు గ్రామస్తులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన భవనాలను సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు బోదల దేముడు, తదితరులకు అప్పగించారు.

● ఆగని నిరసన..



శృంగవరపుకోట మండలం బొడ్డవర గ్రామంలో జిందాల్ నిర్వాసితులు చేస్తున్న నిరసనల పోరు కొనసాగుతూనే ఉంది. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ నేతృత్వంలో నిర్వాసితులు తమ పోరు గురువారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఎక్కడో ఉన్న మానవ హక్కుల సంఘం, ఎస్సీ, ఎస్టీ కమిషన్లు, వినియోగదారుల సమాఖ్య, ఇలా అందరికీ జిందాల్ నిర్వాసితుల గోడు వినిపిస్తోంది, కనిపిస్తోంది. కానీ జిల్లాలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులకు మాత్రం నిర్వాసితుల గోడు అర్థం కావడం లేదు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ చెప్పులు చేతులకు కట్టుకుని నిరసన తెలియజేశారు.

– శృంగవరపుకోట